సాక్షి
మెదక్
7
ఆదివారం । 3 । నవంబర్ । 2024



సబ్సిడీ టార్పాలిన్లు అందేనా..?

ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతూ.. అద్దె కోసం రూ. వేలు ఖర్చుపెడుతున్నారు.

వివరాలు 9లో ▸

పెళ్లింత.. తుళ్లింత

లగ్గానికి మంచి రోజులు వచ్చేశాయ్

మోగనున్న పెళ్లి బాజాలు

- నాలుగు నెలల తర్వాత శుభ ముహూర్తాలు
- వేడుకలకు రూ. లక్షల్లో వ్యయం
- పలువురికి ఉపాధి
- ప్రీ వెడ్డింగ్‌లతో నూతన వధూవరులు బిజీబిజీ

కల్యాణ ఘడియలు వచ్చేశాయి. నాలుగు నెలల తర్వాత అధిక సంఖ్యలో వివాహ ముహూర్తాలు ఖరారవడంతో అంతటా పెళ్లి సందడి నెలకొంది. కన్వెన్షన్ల నుంచి కల్యాణ మండపాల వరకు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి రెండు నెలల పాటు శుభ ముహూర్తాలు ఉండటంతో వందలాది జంటలు ఏకం కానున్నాయి. ఈ సందర్భంగా పలు రంగాల వారికి కూడా ఉపాధి లభించనుంది. అలాగే పెళ్లి వేడుక చెదరని జ్ఞాపకంలా జీవితాంతం గుర్తుండి పోయేలా నూతన వధూవరులు ప్రీ వెడ్డింగ్‌లో బిజీగా ఉన్నారు. ఎంతలా అంటే.. సినిమాలకు దీటుగా చిత్రీకరించేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. సుమారు 500 నుంచి 1,000 వరకు వివాహాలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

8లో



బొగ్గుల రాజశేఖర్ / రాంచర్ల వేణుగోపాల్ రెడ్డి
సంగారెడ్డి జోన్: / దుబ్బాక టౌన్:

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ దుకాణం తెరవనివ్వను

మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు



మాట్లాడుతున్న హన్మంతరావు

మెదక్‌జోన్: ప్రాణం పోయినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ దుకాణం తెరవనివ్వనని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని ద్వారకా గార్డెన్‌లో నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో ఆయన హాజరై మాట్లాడారు. ఆ పార్టీ అధికారంలోకి రాదన్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ పథకాలు అందాలన్నా, రాజకీయంలో వాటా దక్కాలన్నా కుల గణన సర్వేతోనే అందరికి న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో రాహుల్‌గాంధీ జోడో యాత్రలో పేర్కొన్నారని, దానిని రేవంత్‌రెడ్డి తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. ఈ కులగణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని, కానీ బీసీలు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకుంటారన్నారు.ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, నాయకులు పవన్, సుప్రబాత్‌రావు, అరుణ, హఫీజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన హర్షిత



చిన్నశంకరంపేట(మెదక్): కళా ఉత్సవ్ రాష్ట్రస్థాయి స్టోరీ టెల్లింగ్ పోటీల్లో చిన్నశంకరంపేట మండలం చందంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిత ప్రథమ స్థానం దక్కించుకుని జాతీయ స్థాయికి ఎంపికైంది. రెండు రోజుల పాటు హైదారాబద్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలలో డ్యాన్స్‌లో ఐశ్వర్య గ్రూప్, వాయిద్యాల పోటీలో అఖిల్‌కు ప్రోత్సాహక బహుమతులు పొందారు. విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాజీవ్ మెమెంటో, నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీఈఓ రాధాకిషన్, ఎంఈఓ ప్రవీణ్, ఏఎంఓ సుదర్శన మూర్తి, మెదక్ జిల్లా కళా ఉత్సవ్ కమిటి సభ్యులు అంజాగౌడ్, మాధవరెడ్డి, వంశీకృష్ణ అభినందించారు.

ఉద్యమకారుల ఫోరం కార్యదర్శిగా సాయిబాబ



పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం కొత్తలింగాయిపల్లికి చెందిన సాయిబాబ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉద్యమ సమయంలో అనేక పోరాటాల్లో పాల్గొని, ధూంధాం సభల్లో తనదైన శైలిలో ఆటపాటలతో అలరించి ప్రజల్లో గుర్తింపు పొందారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయనను గుర్తించి ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఈ నియామకం చేశారు.

కులగణన నుంచి మినహాయింపు ఇవ్వండి

తపస్ జిల్లా అధ్యక్షుడు జీడి ఎల్లం



మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు జీడి ఎల్లం

మెదక్‌జోన్: ప్రాథమిక ఉపాధ్యాయులను కుల గణన నుంచి మినహాయింపు ఇవ్వాలని తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీడి ఎల్లం, చల్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ .. ప్రాథమిక పాఠశాలలకు వచ్చే చిన్నారులను మధ్యలో వదిలేస్తే వారు ఎక్కడికి వెళుతారన్నారు. చిన్నారి విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను కుల గణన నుంచి మినాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం కుల గణనకు అత్యవసరం విభాగాలను మినహాయింపు ఇచ్చి అన్నశాఖల నుంచి ఉద్యోగులను ఆదేశిస్తే రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా నాయకులు మనేటి సంతోష్, కృష్ణాగౌడ్, నరేందర్ ఉన్నారు.

ధాన్యం దించుకోం..!

మిల్లర్ల అల్టిమేటం

- మళ్లీ విఫలమైన అధికారుల చర్చలు
- ఇప్పటికి రెండుసార్లు సమావేశం
- వదలని వర్షం.. తడిసి ముద్దవుతున్న వడ్లు
- అయోమయంలో రైతులు



రైస్‌మిల్లర్లతో అధికారులు జరుపుతున్న చర్చలు

మెదక్‌జోన్: రైతుల నుంచి వానాకాలం ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తప్పేలా లేవు. సివిల్ సప్లై సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో దించుకోబోమని రైస్‌మిల్లర్లు తెగేసిచెప్పినట్లు సమాచారం. జిల్లా స్థాయి అధికారులు రైస్‌మిల్లర్లతో ఇప్పటికే రెండుసార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తాజాగా శనివారం సైతం జరిపిన చర్చలు కొలిక్కి రాకపోవడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పది శాతం బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని, వెంటనే సాధ్యం కాకుంటే వారం, పది రోజుల్లో ఇస్తామంటూ అండర్‌టేకింగ్ ఇచ్చి ధాన్యం దింపుకోవాలని అధికారులు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కానీ మిల్లర్లు కుదరదని తేల్చి చెప్పినట్లు తెలిసింది. అధికారులు ఒత్తిడి తేవటంతో మా అసోసియేషన్‌లో చర్చించాక చెబుతామని చెప్పి వెళ్లిపోయినట్లు తెలిసింది. అధికారులు మాత్రం చర్చలు కొలిక్కి వచ్చినట్లేనంటూ చెప్పటం గమనార్హం.

మెదక్ జిల్లాలో 104 రైస్‌మిల్లులు ఉన్నాయి. వివిధ కారణాలతో 60 మిల్లులకు ధాన్యం ఇవ్వటం కుదరదని, కేవలం 44 మిల్లులకు మాత్రమే ధాన్యం ఇస్తామని అధికారులు ఇది వరకే తేల్చి చెప్పారు. ప్రభుత్వం నిబంధనలు పాటించి ధాన్యాన్ని దింపుకోవాలని అధికారులు పేర్కొనగా, తమ డిమాండ్లు నెరవేరిస్తే తప్ప ధాన్యం దింపుకోవటం ఎట్టి పరిస్థితుల్లో కుదరదని మిల్లర్లు ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. క్వింటాలు సన్న ధాన్యాన్ని మరాడిస్తే రూ.250, దొడ్డు ధాన్యానికి రూ.150 చొప్పున ఇవ్వాలన్నారు. సన్నధాన్యం క్వింటాలు మరాడిస్తే ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం 67 కిలోల బియ్యం రాదని కేవలం 58 కిలోల బియ్యం మాత్రమే వస్తాయన్నారు. అధికారుల సమక్షంలో చెక్ చేశాకే ఒప్పందం చేసుకోవాలన్నారు. అలాగే 10శాతం బ్యాంకు గ్యారంటీలు ఇవ్వటం కుదరదని, గతంలో ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యాన్ని సకాలంలో ఇవ్వలేదనే సాకుతో విధించిన పెనాల్టీని బేషరతుగా రద్దు చేయాలని మిల్లర్లు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేరిస్తేనే ధాన్యం దింపుకొంటామని చెప్పినట్లు తెలిసింది.

వెంటాడుతున్న వర్షాలు

మరోపక్కా అకాల వర్షాలు దంచి కొడుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉంచిన ధాన్యం తడిసి ముద్ద అవుతోంది. దీంతో అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. అటుమిల్లర్లు ముందుకు రాక పోవటం.. ఇటు వర్షాలతో ధాన్యం తడిసి పోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రులు సైతం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

హామీల అమలులో విఫలం



సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న చుక్కరాములు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి చుక్కారాములు ఫైర్
- తూప్రాన్‌లో సీపీఐ(ఎం) 15వ మహాసభలు



తూప్రాన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం(ఐ) నాయకులు, కార్మికులు

తూప్రాన్: కార్మికుల పక్షాన నిలబడేది ఎర్రజెండా అని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి చుక్కారాములు పేర్కొన్నారు. తూప్రాన్‌లో శనివారం నిర్వహించిన ఆ పార్టీ 15వ జిల్లా మహాసభకు జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ.. అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల ఎర్ర జెండాకు మద్దతిస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకుండా, మతం పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. మతం ఆధారంగా ఓట్లు అడగటం దుర్మార్గమన్నారు. పేద ప్రజల కష్టాలు తీర్చలేని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం .. వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై పరిపాలన చేయకుండా, హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తుందని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం తప్ప మరేమి చేసిందేమీలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త డ్రామాలు మొదలుపెట్టి హైడ్రా పేరుతో ప్రభుత్వ భూముల్లో బడాబాబులు కబ్జాలు చేసిన భూములను స్వాధీన పరచుకుంటామని చెప్పి, పేద ప్రజల ఇళ్లను కూలగొడుతున్నారని ఆరోపించారు. పేదల కోసం ఇళ్లు కట్టించాల్సింది పోయి.. వారు కట్టుకున్న ఇళ్లనే కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో కార్మికుల హక్కులను సాధించే విధంగా భవిష్యత్‌లో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యం

ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్ కీలకమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రూరల్ సీఐ, మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలను నియంత్రించడంతో పాటు, శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలగాలంటే విజిబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. పెండింగ్‌లో నేరాలు, చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్యే ఉంటూ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న పోలీసుల పాత్రే కీలకమన్నారు. ప్రజలతో మమేకమై, మరింత చేరువ అవడానికి కమ్యూనిటీ పోలీసింగ్ అమలుపరచాలని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలో పటిష్టమైన పోలీసు వ్యవస్థ ఉందన్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, మెదక్ రూరల్ ఎస్ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న హోంగార్డులు

హోంగార్డుల సమస్యలు పరిష్కరిస్తా

మెదక్ మున్సిపాలిటీ: హోంగార్డుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో హోంగార్డులతో ఎస్పీ ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి యూనిఫాం అలవెన్స్ త్వరలో అందజేసేలా చర్యలు చేపడుతామని చెప్పారు. రేస్‌కోర్ట్స్ హెల్త్‌కార్డుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి ముందుంటామని పేర్కొన్నారు, యూనిఫాం సర్వీస్ డెలివరీలో అందరూ సమానమని చెబుతూ.. తామంతా ఒకే కుటుంబ సభ్యులమని ఎస్పీ చెప్పారు. అయితే.. క్రమశిక్షణ తప్పిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రులు, కళాశాల ఫీజులలో రాయితీతో పాటు మరిన్ని లబ్ధి చేకూర్చే అంశాలపై దృష్టి సారిస్తామని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, రంగనాయక్ పాల్గొన్నారు.

వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టండి

జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు సత్యనారాయణ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో వెంటనే వరిధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. శనివారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, తడిసిన వడ్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రధాన మంత్రి మోదీ ప్రతి సంవత్సరం వరికి మద్దతు ధరను పెంచుతున్నారని తెలిపారు. కేంద్రం అన్ని వసతులు కల్పిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశినాథ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, నాయకులు ప్రసాద్, చింతల శేఖర్, అభిషేక్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన నేతలు

మెదక్ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నగేశ్‌ను బీసీ సంక్షేమ సంఘం తరఫున మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీసీల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారం, చింతల శేఖర్ ,గణేష్, ఉమామహేశ్వర్, నరేష్ ,యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆగమాగం !

- 4 ప్రాజెక్టులకు ఇద్దరే సూపర్‌వైజర్లు
- 366 అంగన్‌వాడీ పోస్టుల ఖాళీ
- ఏడాది కాలంగా ట్రై సైకిళ్లు లేవు
- పర్యవేక్షణ లేక అంగన్‌వాడీల అస్తవ్యస్తం

మెదక్ కలెక్టరేట్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సమస్యలతో సతమతమవుతోంది. జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా.. కేవలం ఇద్దరే సూపర్‌వైజర్లు ఉన్నారు. వందల సంఖ్యలో అంగన్‌వాడీ పోస్టులు ఖాళీలు ఉండగా పర్యవేక్షణ కొరవడి సెంటర్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఫలితంగా చిన్నారులకు విద్యాబోధన, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందడం లేదు. ఇదే సమయంలో దివ్యాంగులకు సంబంధించి గత ఏడాది నుంచి ట్రై సైకిళ్లు రాక వికలాంగులు దరఖాస్తులు చేసుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో 21 మండలాలు ఉండగా నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు ఇద్దరే సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. రామాయంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు మెదక్, నర్సాపూర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే అల్లాదుర్గం ప్రాజెక్టు సూపర్‌వైజర్‌గా ఒక్కరే పనిచేస్తున్నారు.

1076 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 1,076 మంది టీచర్లు, 1,076 మంది ఆయాలు ఉండాలి. కానీ..1,043 మంది టీచర్లు, 796 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఇటీవల మరో 70 మంది అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు రిటైర్మెంట్ పొందారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు మొత్తం 366 ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయాలు లేని చోట్ల టీచర్లే వంటలు చేస్తూ పిల్లల ఆలనా, పాలనా చేస్తున్నారు. మరో వైపు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం ఇతర సేవలు చేయడంతోనే సరిపోతుంది. దీంతో పిల్లల విద్యాభ్యాసంపై దృష్టి పెట్టడం లేదు.

ఏడాది కాలంగా ట్రై సైకిళ్లు బంద్

దివ్యాంగులకు ఇచ్చే ట్రైసైకిళ్లు గతేడాది కాలంగా మెదక్ ఐసీడీఎస్‌కు రావడం లేదు. జనవరి నుంచి ఇప్పటి వరకు ట్రై సైకిళ్ల కోసం సుమారు పది మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకొని ఎదురు చూపులు చూస్తున్నారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు పడరాని పాట్లు పడుతూ ప్రతి వారం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి విన్నవిస్తున్నారు.

పది నెలలవుతుంది



సొంత ఊరిలో పని దొరకక బతుకు దెరువు కోసం హైదరాబాద్ వెళ్లాను. గత ఏడాది డిసెంబర్ 26న బైక్‌పై సొంత గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాలు విరిగిపోయింది. ప్రస్తుతం నేను నడవలేను. ఏ పనికూడ చేయలేని పరిస్థితి. కుటుంబ పోషణ భారంగా ఉంది. ట్రై సైకిల్ కోసం జనవరిలో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ ఇస్తలేరు. ఎప్పుడొచ్చినా..పై నుంచి రాలేదు. రాగానే ఇస్తామని చెబుతున్నారు.

- కట్లే మల్లేశం, మద్దుల్వాయి.

పక్షవాతంతో నడుం పడిపోయింది



పక్షవాతంతో నడుం పడిపోయింది. పైకి లేవలేని పరిస్థితి. భూమిపైనే కూర్చోవాల్సిన దుస్థితి. పాకడం కూడా కష్టంగా ఉంది. ట్రై సైకిల్ ఇప్పించాలని నాలుగు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ ఎలాంటి సమాధానం లేదు. ఎవరు సరైన సమాధానం చెప్తలేరు. ఎన్నో అవస్థలు పడుతూ వస్తున్నా.

- కంబాల సత్యనారాయణ, రాయిన్‌పల్లి

రెండు రోజుల్లో కొనుగోళ్లు చేపట్టాలి

బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు పద్మారెడ్డి డిమాండ్



మెదక్ మున్సిపాలిటీ: రెండు రోజుల్లో జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు చేయకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. కొబ్బరికాయలు కొడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం కాదు అకాల వర్షాల నుంచి రైతులను ఆదుకొని ధాన్యాన్ని తూకం వేయాలని చెప్పారు. సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం చేయకపోతే అన్నదాతల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను నమ్మి రైతులు ఓట్లేస్తే.. ఆరు కాలం కష్టపడి పండించిన పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా చుక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెనువెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి త్వరగా, ధాన్యం తూకం వేసి 72 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ చేశామని గుర్తు చేశారు. సన్న నరకానికి రూ. 500 బోనాస్ ఇవ్వడం దేవుడెరుగు, అసలు ధాన్యమే కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.

సోలార్ ప్లాంట్ సందర్శించిన విద్యార్థులు



సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ విద్యార్థులు మండలంలోని రుద్రారంలోని సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. శనివారం జూనియర్ కళాశాల విద్యార్థులు సోలార్ ప్లాంట్‌ను సందర్శించగా.. సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యాపక బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు వృత్తి నైపుణ్యతను పొందాలని కోరారు. రెండు నెలల పాటు అందించే శిక్షణతో ఉద్యోగ, ఉపాధి మార్గాలకు అనుకూలత ఏర్పడుతుందన్నారు. అధ్యాపకులు లక్ష్మీపతి, శ్రీవాణి, విక్రమ్, తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలిక కిడ్నాప్
నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు హద్నూర్ ఎస్‌ఐ చల్ల రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల పరిధిలోని మామిడ్గి గ్రామానికి చెందిన ఈడ్గి వినోద్ గౌడ్(21) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నట్లు నటించి ఫోన్ నంబర్ తీసుకొని తరచూ మాట్లాడుతుండేవాడు. ఎక్కడికైనా వెళ్లి పెళ్లి చేసుకుందామని నమ్మించి అక్టోబర్ 22న రాత్రి బాలికను కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. మరుసటి రోజు బాలికను మామిడ్గి గ్రామంలో విడిచి పెట్టి పరారయ్యాడు. తన కూతురిని కిడ్నాప్ చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలి తండ్రి హద్నూర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

భర్తతో గొడవపడి ఆత్మహత్య
పటాన్‌చెరు టౌన్: భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన ధనరాజ్ అతడి భార్య పావని(31) అక్టోబర్ 31 తేదీన గొడవపడ్డారు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పావని సీలింగ్ ఫ్యాన్ కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్తతో గొడవపడి మనస్తాపం చెంది తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని కూలీ..



ముఖేష్ మృతదేహం

టేక్మాల్(మెదక్): ఉరేసుకొని బీహార్ కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టేక్మాల్ మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్సై తుక్కయ్య కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ పాశ్వాన్ (34) కూలీ పనుల నిమిత్తం గత నెల 30వ తేదీన పాపన్నపేటకు వచ్చాడు. శనివారం ఉదయం పాపన్నపేట మండలంలోని డాక్యా తండాలో కూలీ పనులు చేస్తుండగా భార్యతో ఫోన్‌లో గొడవపడ్డాడు. అనంతరం పని నుంచి వెళ్లిపోయాడు. తోటి కూలీలు వెతకగా వెంకటాపూర్ సున్నం గట్టు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి బావమరిది అనిల్ పాశ్వాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి..
హుస్నాబాద్: అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదురుగా బండి మహేందర్ (37) నివాసం ఉంటున్నాడు. ఉపాధి కోసం హోటల్ నడిపించి తర్వాత కిరాణ దుకాణం పెట్టాడు. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో అప్పులు బాధతో ఇబ్బందులకు గురయ్యాడు. రెండేళ్ల ఉపాధి కోసం దుబాయికి వెళ్లగా అక్కడ కూడా పని దొరుక్కపోవడంతో తిరిగి ఇంటికొచ్చాడు. ప్రస్తుతం ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.





ప్రీ వెడ్డింగ్.. ట్రెండింగ్

పెళ్లింత.. తుళ్లింత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోగనున్న పెళ్లి బాజాలు ● ప్రీ వెడ్డింగ్‌లతో నూతన వధూవరులు

సంగారెడ్డి జోన్: ప్రస్తుతం పోటీ పడుతున్న ప్రపంచంలో వివాహ వేడుక పది కాలాలపాటు గుర్తుండిపోయే విధంగా ప్రతీ ఒక్కరూ నచ్చేలా.. మెచ్చేలా అడుగులు వేస్తున్నారు. మంచి ముహూర్తాలు ఉండటంతో పిల్లలకు పెళ్లి చేసే పనిలో బిజీ కానున్నారు. ఆహ్వాన పత్రికలు ప్రింటింగ్ చేయించటం, బంధుమిత్రులకు ఆహ్వానించడం, షాపింగ్‌లు, స్టేజీ డెకరేషన్, ఇంటి డెకరేషన్, మెహందీ, సంగీత్, వెలకమ్, మంగళ స్నానాల వేదిక ముస్తాబు, బరాత్ ఇలా అన్ని రకాల పనులలతో సందడి వాతావరణం మొదలు కానుంది.

పలు రంగాలకు ఉపాధి
వివాహ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు రంగాల వారికి ఉపాధి మెండుగా లభించనుంది. పందిరి వేసే వారి నుంచి పెళ్లి కూతురు పెళ్లి జరిగి అత్తారింటికి వెళ్లే వరకు పలువురు ఉపాధి పొందనున్నారు. షాపింగ్ మాల్స్, జ్యువెలరీ, బ్యూటీషియన్లు, బాజాభజంత్రీలు, బ్యాండ్, మండపాల డెకరేషన్స్, పూల డెకరేషన్స్, పెండ్లి పత్రికలు, ఫొటోగ్రఫీ, పురోహితులు, లైటింగ్, ఫుడ్ క్యాటరింగ్‌తోపాటు వివిధ రంగాల వారికి ఉపాధి లభించనుంది.

ముందుగానే ఆర్డర్లు
పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఒక వివాహానికి రూ.6 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చులు అవుతాయి. చాలా రోజులు తర్వాత వరుసగా ముహూర్తాలు ఉండటంతో అన్నింటికి డిమాండ్ ఉంటుంది. వేడుకలకు అన్నింటికి ముందుగానే ఆర్డర్లు ఇచ్చి, బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఫంక్షన్ హాల్స్ బుకింగ్‌లు అవుతున్నాయి.

ప్రీ పోస్ట్ వెడ్డింగ్ వీడియోలపై ఆసక్తి
వివాహాలు జరుపుకునే వారు ప్రస్తుతం ప్రీ పోస్ట్ వెడ్డింగ్ వీడియోలపై ఆసక్తి చూపిస్తున్నారు. వీటి కొరకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్, తర్వాత పోస్ట్ వెడ్డింగ్ షూట్‌లు నిర్వహిస్తున్నారు. షూట్ కొరకు తమకు నచ్చిన లొకేషన్‌తో పాటు చారిత్రాత్మక ప్రదేశాల కొరకు వందల కిలోమీటర్లు వెళ్తున్నారు. వివాహ సమయాల్లో వీడియోలు చేయించుకొని వేడుకలో స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వీడియోలు ప్లే చేస్తున్నారు.

వేడుకలకు రూ.కోట్లలో వ్యాపారం
ఉమ్మడి మెదక్ జిల్లాలో ఫంక్షన్ హాల్స్, బంకెట్ హాల్స్ సుమారు 200 నుంచి 300 వరకు ఉంటాయి. ఫంక్షన్ హాల్ అద్దె నాన్ ఏసీ రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు, ఏసీ అయితే జనాభా సామర్థ్యాన్ని బట్టి సుమారు రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అద్దెలు చెల్లిస్తారు. డెకరేషన్ కోసం రూ.30 వేల నుంచి రూ.3లక్షల వరకు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఫొటోగ్రఫీ, అవుట్ డోర్ ఈవెంట్ షాపులు సుమారు 600 నుంచి 1,000 వరకు ఉంటాయి. ఈవెంట్ నిర్వహణ బట్టి రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చులు చెల్లిస్తుంటారు. షాపింగ్ కోసం రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు, నగల కొనుగోళ్లకు రూ.2 లక్షల నుంచి సామర్థ్యాన్ని బట్టి రూ.50 లక్షల వరకు చేస్తుంటారు. ఫుడ్ క్యాటరింగ్ కోసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు చేస్తుంటారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారు 500 నుంచి 1,000 వరకు వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఈ మేరకు జిల్లాలోని పెళ్లిళ్లకు సుమారు రూ.50 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు వ్యాపారాలు జరుగనున్నాయి.

శుభకార్యాలకు ముఖ్యమైన తేదీలు
నవంబరు 3, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 16, 17, 20, 21, 23, 26, 27.
డిసెంబరు 5, 6, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 18, 20, 22, 23, 25, 26.

మంచి ముహూర్తాలు ఉన్నాయి



రెండు నెలలు శుభ కార్యాలతోపాటు వివాహ వేడులకు మంచి రోజులు ఉన్నాయి. వందల సంఖ్యలో జంటలు ఏకం కానున్నాయి. మూడు నెలలపాటు ఎలాంటి వేడుకలు జరుగలేదు. మంచి ముహూర్తాలకు ఎదురు చూశారు. మళ్లీ రెండు నెలల తర్వాతే మంచి రోజులు ఉంటాయి.
–శివప్రసాద్ స్వామి, కేతకి సంగమేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు, ఝరాసంగం

ఆర్డర్లు వస్తున్నాయి



వివాహాలతోపాటు శుభ కార్యాలకు ఆర్డర్లు వస్తున్నాయి. ఇప్పటికే పలు ఆర్డర్లు వచ్చాయి. మూడు నెలల పాటు సరైన విధంగా వ్యాపారం జరగలేదు. రెండు నెలల పాటు ముహూర్తాలు ఉండటంతో మంచి ఉపాధి లభిస్తుంది.
–అనిల్‌కుమార్, టెంట్ హౌస్, లైటింగ్ నిర్వాహకుడు, ఝరాసంగం

షూట్‌లపై ఆసక్తి



వివాహాలు జరుపుకునే వారు జ్ఞాపకంగా ఉండేందుకు ప్రీ పోస్ట్ వెడ్డింగ్‌లపై ఆసక్తి చూపిస్తున్నారు. త్వరలో జరిగే వివాహాల కోసం ఇప్పటికే పలు వెడ్డింగ్ షూట్‌లను నిర్వహించాం. లొకేషన్స్‌తో పాటు క్వాలిటీని బట్టి ధరలు ఉన్నాయి. – సంతోష్‌కుమార్, అవుట్ డోర్ వెడ్డింగ్ ఈవెంట్ నిర్వాహకుడు, కక్కర్‌వాడ

దుబ్బాకటౌన్: పెళ్లంటే పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు, తాళాలు, తంబ్రాలు, మూడు ముళ్లు.. ఏడడుగులు ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ ప్రస్తుతం వీటితోపాటు పెళ్లి వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

నాడు ఇలా..
పెళ్లంటే నూరేళ్ల పంటగా భావించే నాటి తరం వారు వారం రోజులపాటు పెళ్లి పనుల్లో బిజీబిజీగా మారేవారు. నాడు వధూవరుల ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా, పెళ్లి చేయాలనుకున్న యువతీ యువకుల ఈడూ జోడూ సరిపోతాయనుకున్న తర్వాతనే పెళ్లి తంతులను మొదలు పెట్టేవారు. దీంతో పెళ్లి చేసుకోవాలనుకున్న వధూవరులు మాట్లాడుకోవడానికి గానీ, ప్రత్యక్షంగా చూసుకునే అవకాశాలు కూడా ఉండేవి కావు. ఇక పెళ్లి తంతులోనే వధూవరులు ఒకరినొకరు ఎదురెదురుగా చూసుకునే అవకాశాలు ఉండేవి. నాడు ఫొటోగ్రఫీ, వీడియోలు అంతగా శాస్త్ర పరిజ్ఞానం లేకపోవడంతో పెళ్లి కార్యక్రమాలను కేవలం ప్రతి ఒక్కరి మదిలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయేవి.

నేడు ఇలా..



నాటి తరం ముగిసింది. నేటి తరం పెళ్లి తంతులో మార్పును తీసుకొస్తోంది. పెళ్లికి ముందే ఒకరికొకరు పరిచయం చేసుకోవడంతోపాటు, ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌ల వరకు వెళ్తుంది. దీనికి ముందు ఇరు కుటుంబాలను ఒప్పిస్తున్నారు. ముందు తల్లిదండ్రులు అడ్డు చెప్పినప్పటికీ మారుతున్న కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌లకు అనుమతినిస్తున్నారు. పెళ్లి చూపులు మొదలుకొని, పసుపులు ముట్టడం, కల్యాణం, విందులు, రిసెప్షన్‌లో ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ జీవిత కాలం గుర్తుండిపోయేలా భద్రపరుచుకుంటున్నారు.

ప్రాంతాలను బట్టి చార్జీలు



ప్రీ వెడ్డింగ్ కోసం వీడియో గ్రాఫర్లు ప్రాంతాలు, లొకేషన్‌లను బట్టి చార్జీలు తీసుకుంటున్నారు. రూ.35 వేల నుంచి 50 వేల వరకు చార్జీ చేస్తుంటారు. వాహన ఖర్చు, డ్రెస్సింగ్, తదితర ఖర్చులు వెడ్డింగ్ షూట్ చేసుకునే వారే చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ప్రీ వెడ్డింగ్ షూట్ చేయడానికి 2 రోజుల నుంచి 3 రోజుల సమయం పడుతుంది. దీని కోసం ప్రత్యేకంగా అనుభవజ్ఞులైనా నిపుణులు, కెమెరా మెన్‌లను, సాంకేతిక బృందాలను ఆశ్రయిస్తున్నారు. పాటల చిత్రీకరణకు దుబ్బాక బాలాజీ దేవాలయం, సిద్దిపేట రంగనాయక సాగర్, కోమటి చెరువు, కరీంనగర్, హైద్రాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు.

సినిమాలను తలపించేలా..



మారుతున్న కాలానికి అనుగుణంగా పెళ్లి జంటలు ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌ను ఇష్టపడుతున్నారు. వారు ఎంచుకున్న ప్రదేశాలకు వెళ్లి ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తాం. సినిమాలను తలపించేలా చిత్రీకరణ చేయడానికి ఎన్నో ఇబ్బందులకు గురవుతాం. కానీ అనుకున్న ఔట్ పుట్ రావడానికి ఎంతటి కష్టానికైనా వెనుకాడను.
– కార్తికేయ, హ్యాపీ డైరీస్ ఎడిటింగ్ స్టూడియో, దుబ్బాక

మంచి అనుభూతినిస్తుంది



జీవితంలో పెళ్లి అనేది ఓ మధుర జ్ఞాపకం లాంటిది. అలాంటి పెళ్లి వేడుకలు జీవితాంతం గుర్తుండి పోయేందుకు ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్ ఒక మంచి అనుభూతినిస్తుంది. మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు దోహదపడుతుంది. దీంతో ఒకరి మనోభావాలు మరొకరు తెలుసుకునే అవకాశం ఉంటుంది.
– సాయి, సౌమ్య దంపతులు, దుబ్బాక

సెలవుల్లో విదేశాల నుంచి వచ్చి..
రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కిషోర్‌రెడ్డి (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): విదేశాల్లో చదువుకోవడానికి వెళ్లిన యువకుడు సెలవులు రావడంతో సొంత ఊరికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ విషాదకర ఘటన సుచిత్ర సర్కిల్ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వెల్దుర్తి మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన వెన్నవరం మహిపాల్‌రెడ్డి, ఇందిర దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.. కుమారులిద్దరూ విదేశాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఇటీవల కళాశాలకు సెలవులు రావడంతో ఇద్దరు కుమారులు సొంత ఊరికి వచ్చారు. రెండు రోజుల కిందట సుచిత్రలో ఉన్న మరో ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వేకువజామున చిన్న కుమారుడైన సాయి కిషోర్‌రెడ్డి (24) సుచిత్ర సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో కిందపడగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరికొన్ని నెలల్లో చదువు పూర్తై జీవితంలో స్థిరపడతాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

భవనంపై నుంచి పడి మేస్త్రీ..



ఆంజనేయులు మృతదేహం

పటాన్‌చెరు టౌన్: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి పడి మేస్త్రీ మృతి చెందిన ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట రెడ్డి కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి బీరంగూడ మంజీరా కాలనీలో ఉంటున్న ఆంజనేయులు (39) చిన్న మేస్త్రీగా పని చేస్తున్నాడు. శనివారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సాయికాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పనిచేస్తున్న క్రమంలో నాలుగో అంతస్తు కాలు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బిల్డర్లు హర్షవర్ధన్, వంశీకృష్ణ, కౌటిల్య రెడ్డితోపాటు మేస్త్రీ శివయ్య సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే
కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్రాంతితో పాటు అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై కీలక సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలు, ఎన్యూమరేటర్లు పక్కాగా సర్వే నిర్వహిస్తూ, ఆయా కుటుంబాలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించేలా చూడాలన్నారు. సూపర్వైజర్లు సర్వే తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలను నిశితంగా పరిశీలించాలని, తప్పులు లేకుండా ఆన్లైన్లో వాటిని నమోదు చేయించాలని అన్నారు. అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ భూములను పరిరక్షించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయ భూములను కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. ఆ మేరకు శనివారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్‌కు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్లన్న ఆలయ పరిసరాలలోని భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఆక్రమణదారులను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆలయ, రెవెన్యూ అధికారులు స్పందించి ఆలయ భూములను రక్షించాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్ గనబోయిన శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కనుకయ్య, మండల ఉపాధ్యక్షుడు తిరుపతిగౌడ్, యువమోర్చా మండల అధ్యక్షుడు సనాది కరుణాకర్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తడకపల్లి కనుకయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



సిద్దిపేటజోన్: స్థానిక టీటీసీ భవన్‌లో శనివారం అండర్–14, 17 రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు సభ్యులు ఈనెల 8 నుంచి వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపిక ప్రక్రియను వెంకటస్వామి, సతీష్, రాధిక, రజని, కవిత, మధు, భిక్షపతి పర్యవేక్షించారు.

డీసీసీబీ చైర్మన్ కారు ఢీకొని
మహిళ మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

గజ్వేల్‌రూరల్: కారు ఢీకొని మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా కథనం మేరకు..సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ రాజా, అతడి భార్య జమీల(70), కొడుకు ఖజీమ్, కోడలు సకినాల్‌రాజులు కారులో జనగాం నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలోని గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలోని ఎస్4 హోటల్ వద్ద భోజనం చేశారు. తర్వాత సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు కారులో రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి ప్రయాణిస్తున్న ఫార్చునర్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో జమీల మృతి చెందగా మిగితా ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌కి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ: ఒకరు మృతి
పటాన్‌చెరు టౌన్: ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన కృష్ణ(54), మల్లేశ్, యాదయ్య ముగ్గురు బైక్‌పై శుక్రవారం రాత్రి భానూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి ఘనపూర్ వైపు వస్తుండగా నందిగామ శివారులోకి రాగానే ఎదురుగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్ర గాయాలు కాగా, మల్లేశ్, యాదయ్యకు స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పటాన్ చెరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

బొలేరో వాహనం బోల్తా



మనోహరాబాద్(తూప్రాన్): బోల్తా పడిన బొలేరో వాహనం

మనోహరాబాద్(తూప్రాన్): బొలేరో వాహనం బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రైల్వే విధులు నిర్వహిస్తున్న సీనియర్ సెక్షన్ అధికారి సాయినాథ్, డ్రైవర్ త్రిలోక్ బొలేరో వాహనంలో పని నిమిత్తం కామారెడ్డికి వెళ్తున్నారు. జాతీయ రహదారి 44పై మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ శివారులోకి రాగానే యూటర్న్ వద్ద బైక్ అకస్మాతుగా రోడ్డు పైకి వచ్చింది. బైక్‌ను తప్పింటే క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని వృద్ధురాలు
పటాన్‌చెరు టౌన్: కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ శ్రీ గురు రాఘవేంద్ర రెసిడెన్సీలో నివాసం ఉంటున్న లక్ష్మీ కామాక్షి(69) శనివారం పని నిమిత్తం బయటకు వచ్చింది. తిరిగి అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లడానికి రోడ్డు దాటుతుంది. ఇదే సమయంలో కృష్ణారెడ్డిపేట్ వైపు నుంచి బీరంగూడ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వృద్ధురాలిని చికిత్స కోసం పటాచెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి
● జహీరాబాద్‌లో చదువుకుంటున్న కర్ణాటక విద్యార్థి
● గదిలో బెడ్ మీద పడటంతో చనిపోయాడు : పోలీసులు



సాత్విక్ (ఫైల్)

జహీరాబాద్: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి చెందిన ఘటన జహీరాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని గుల్‌బర్గా జిల్లా చించోళి తాలుకా పరిధిలోని శివరాంపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెండో కుమారుడు సాత్విక్(12) సెవెంత్‌డే పాఠశాల హాస్టల్‌లో ఉంటూ అదే పాఠశాలలో 5వ తరగతి చదువుకుంటున్నాడు. ఉదయం హాస్టల్ గదిలో తనకు కేటాయించిన డబుల్ కాట్ బెడ్ పైనుంచి కిందకు దిగుతున్న క్రమంలో బోర్లా పడగా బెడ్ అతడిపై పడడంతో తల వెనుక భాగంలో బలమైన గాయమైంది. వెంటనే స్కూల్ యాజమాన్యం ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్ పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించాడు. తండ్రి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యార్థి మృతి విషయమై ఎంఈఓ బస్వరాజ్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అలాగే, విద్యార్థి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని పాఠశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థి సాత్విక్ చనిపోయాడని ఆరోపించారు. హాస్టల్ గదిలో ఉంటున్న విద్యార్థులు ఒకరికి ఒకరు ఆట పట్టించుకునే క్రమంలో ఈ ఘటన జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై వివరణ అడిగితే పాఠశాల ప్రిన్సిపాల్ స్పందించలేదు.

తూప్రాన్‌లో వ్యక్తి ..
తూప్రాన్: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నర్సంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మధ్యల తండాకు చెందిన మెగవాత్ నాగార్జున(38) సెప్టెంబర్ 9న అదే తండాకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఓ మహిళ విషయంలో దాడికి పాల్పడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన నాగార్జునను కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇంటికొచ్చిన కొద్ది రోజుల తర్వాత శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దాడిలో తీవ్రంగా గాయపడటంతో నాగార్జున మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద కింద కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేపడుతామని తెలిపారు.

యువకుడి మృతిపై అనుమానాలు
మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేట గ్రామానికి చెందిన యువకుడి మృతిపై పలు అనుమానాలు తావిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి దీపావళి పండుగ జరుపుకొని ఇంటి నుంచి వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే. కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం బుచ్చిరెడ్డి స్నేహితులను విచారించినట్లు సమాచారం. పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాతే వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు. గ్రామ సమీపంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులతో బుచ్చిరెడ్డి సన్నిహితంగా ఉంటూ పలు సందర్భాల్లో మద్యం సేవించేవాడని, ఆ సమయంలో గొడవలు జరిగి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.